

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# కరుణించిన కరుణ

కారు డ్రైవరు గంట సేపు ఆ కాలనీ లోని వీధులన్నీ వాకబు చేసాక గానీ ఆ ఇల్లు ఎక్కడో తెలియలేదు. కారు చిన్న సందులోకి వెళ్ళి ఆగి పోయింది.

కరుణ కారు దిగి చుట్టూ చూసింది. అవన్నీ చిన్న చిన్న ఇళ్ళు. తక్కువ ఆదాయం గల వాళ్ళకోసం కట్టిన ఇళ్ళు. కారు ఆగగానే ఆ ఇళ్ళల్లోని వాళ్ళు తొంగి చూసారు.

"సులోచనా దేవి గారి ఇల్లు ఎక్కడా ?" అని అడిగింది కరుణ.

"అదుగో ఆ ఎదురిల్లే " అన్నది ఒక నడి వయసు స్త్రీ.

కరుణ ఆ ఇంట్లోకి వెళ్ళింది.

అరవై ఏళ్ళ వయసున్న సులోచనా దేవికి చూపు మందగించింది. కరుణ వైపు ఎగాదిగా చూస్తూ "ఎవరు కావాలండీ ?" అని అడిగింది.

"సులొచనా దేవి గారంటే... ?" అని ఆగి పోయింది.

"నేనే ... ఇంతకీ మీరు ?" అని అడిగింది సులోచనా దేవి.

"నేను మిమ్మల్ని చూద్దామనే వచ్చాను. మీ అరోగ్యం ఎలా వుంది ? "

"ఊరు పొమ్మంటోంది, కాదు రమ్మంటోంది.. ఆ దేవుడి పిలుపుకోసం ఎదురు చూస్తున్నాను. ఇంతకీ నీవు ఎవరు ? నేను పొల్చుకోలేక పోతున్నాను. ... " అని అడిగింది సులోచనా దేవి.

"మీరు ఇంతకు ముందు నన్ను చూడలేదు లెండి. అందుకని నన్ను పోల్చుకొలేరు.. ఇంతకీ మీ మనవడు మీ దగ్గరే వున్నాడా? "అని అడిగింది కరుణ.

"నా దగ్గర కాక ఇంకెక్కడ వుంటాడమ్మా ? కోడలు అలా అర్ధాంతరంగా వెళ్ళి పోయింది. వాడు పిచ్చివాడై పోయాడు....."

"అర్ధాంతరంగా వెళ్ళి పోయిందంటే చనిపోయిందా ?"

"మాకు సంబంధించినంత వరకు చనిపోయినట్లే...వాడు దాని పేరు చెబితేనే మండి పడుతున్నాడు. నలుగురిలోకి వెళ్ళ లేక పోతున్నాడు. అగ్ని పర్వతం లాగా లోలోపలే రగిలి పోతున్నాడు. ఉన్న ఊళ్ళో నలుగురి ముందూ తలెత్తుకోలేక, ముంబాయి ట్రాంసఫరు చేయించుకున్నాడు. దాని దోవన అది వెళ్ళి పోయింది. వీడి దోవన వీడు వెళ్ళి పోయాడు. ఈ పసివాడు నా కాళ్ళకు కనిపించని బంధమైనాడు. కాళ్ళూ చేతులూ ఆడని ఆ వయసులో, కంటి చూపు ఆనని ఈ దశలో వాడిని పెంచే భారం నా నెత్తిన పడింది. ఏమి చేయను తల్లీ, చెప్పు..."

ఇప్పుడు వార్ధక్యం లో ఇంత నిస్సహాయంగా మాట్లాడుతోంది గానీ, ఒకప్పుడు ఈమె వెలగబెట్టిన డాబూ దర్పం తక్కువ అయినవేమి కాదు. అప్పట్లో ఆమె మాట వేద వాక్కు లా జరిగి తీరేది. పరిస్థితుల ప్రభావం వల్ల క్రుంగి పోయింది.

ఇంతలో పిల్లవాడి నిద్ర లేచి ఏడవటం మొదలు పెట్టాడు. సులోచనా దేవి పాల సీసా శుభ్రం చేయటంలో నిమగ్నమై పొయింది. కరుణ పిల్లడిని ఎత్తుకొని ఆడించింది. కొత్త ముహాన్ని చూసినందువల్ల కాబోలు వాడు ఏడుపు ఆపాడు.

కరుణ ఇల్లంతా కలియ జూసింది. పేదరికం ఎటుచూసినా కనిపిస్తోంది. కరుణ డ్రైవర్ని పిలిచింది. పిల్లవాడికి కావల్సిన డ్రెస్సూ, ఆటవస్తువులూ తీసుకు రమ్మని చెప్పింది. కారు వెళ్ళిపోయింది.

సులోచనా దేవి పిల్ల వాడిని అందుకుని పాలు పట్టటం లొ నిమగ్నమైంది. తనలో తనే ఏదొ గొణుక్కుంటొంది.

"నా ఖర్మం ఇలా కాలింది. కిందటి జన్మలో చేసుకున్న ప్రారబ్దం ఇలా తగలడింది. పశువులు కూడా కడుపున పుట్టిన వాటి మీద మమకారం చూపిస్తాయి. వాటి కన్నా హీనం అయిపోయారు..."

"మీ అబ్బాయి డబ్బు పంపటం లేదా ?" అని అడిగింది కరుణ.

"పంపించక ఏమమ్మా ? నేను యాభై ఉత్తరాలు రాస్తే యాభై రూపాయలు పంపిస్తాడు. ఈ రోజుల్లో పసిపిల్లల్ని పెంచటం ఎంత కష్టం ? ఎంత కష్టమైనా తల్లితండ్రులకు తప్పదు. అది వాళ్ళ భాధ్యత. కానీ తల్లిదండ్రులు ఇద్దరూ తప్పించుకొని ముసలిదాన్ని నా ప్రాణం తీస్తున్నారు. ..."

కరుణ నిట్టూర్చింది. తనే కలగజేసుకుంది. "పెద్దవారు, మీరు ఇలా కష్టపడుతుంటే చూస్తూ ఎలా వూరుకుంటాను?... నేను కొంచెం సాయం చేస్తాను ఉండండి.."

ఇంతలో డ్రైవరు తెచ్చిన డ్రెస్సు వాడికి తొడిగింది. బొమ్మలు చూపించి అడించింది. సరియైన పోషణ లేక పిల్లాడు ఇలా వున్నాడు గానీ అన్నీ అమరితే పిల్లాడు సొట్ట బుగ్గలతో బోసి నవ్వులు నవ్వుతూ ఎంత ముద్దు వస్తున్నాడో ? ... అనుకున్నది కరుణ.

కరుణ ఆమె దగ్గర సెలవు తీసుకుంటూ, అయిదు వందలు ఆమె చేతిలో పెట్టింది. "పిల్లవాడి ఖర్చులకు వుంచండి." అన్నది.

"ఏమిటమ్మా ఇదంతా ? ఎవరు నువ్వు ? ఇంత శ్రీమంతురాలివి నాలాంటి పేద రాలిని వెదుక్కుంటూ రావటం ఏమిటి ? వాడికి ఇవన్నీ ఇవ్వటం ఏమిటి ? "

"నేను మీకు కావలసిన దాన్నే అనుకొండి. ఇంత కాలం తెలియక రాలేదు... ఇక వస్తూనే వుంటాను... మీ ఇంట్లో మనిషినే అనుకోండి..." అన్నది కరుణ.

కరుణ వచ్చి కారు లో కూర్చుంది. కారు వేగంగా ముందుకు పోతోంది. ఆమె అలోచనలు వెనక్కి పరుగెత్తాయి.

కొన్నేళ్ళ కిందట ఈ సులోచానా దేవి కుమారుడు అనంద్ ని ఆమే ప్రేమించింది. చదువుకున్నంత కాలం ఆనంద్ ను ఒక్క రోజైనా చూడకుండా వుండలేక పోయింది. 'నిన్న నా కలలోకి వచ్చావు' అని ఒకరు అంటే, 'నువు నా కళల్లోనే వున్నావు' అని ఇంకొకరు అనేవాళ్ళు. సినిమాలు, షికార్లు, కబుర్లు వీటి తోనే గడిచి పొయింది కాలమంతా.

ఒకరినొకరు చదవటం పూర్తి అయిన తరువాత పరీక్షలు వచ్చాయి. ఆ తరువాత అసలు పరీక్ష వచ్చింది.

"ఇప్పుడు ఏమి చెయ్యాలో నువ్వే చెప్పు " అన్నది.

"నీకు తెలియనిది ఏముంది ? నా చిన్నప్పుడే తండ్రి పోయాడు. మా అమ్మే నాకు అన్నీ అయి పెంచింది. నా కోసం ఎన్నో కష్టాలు పడింది. ఆమెకు చెప్పకుండా,ఆమెను ఒప్పించకుండా నేను ఏమీ చేయ లేను." అన్నాడు ఆనంద్.

"మీ అమ్మకు చెప్పే ధైర్యం నీకు లేక పోతే మా వాళ్ళు వచ్చి మాట్లాడుతారు " అన్నది కరుణ.

కరుణ తల్లిదండ్రులు వెళ్ళి సులోచన దేవిని కల్సు కున్నారు. "పిల్లలు ఇద్దరూ ఇష్ట పడ్డారు. మనకు అంత కన్నా కావలిసిన దేముంది ? " అన్నది కరుణ తల్లి.

"వాడి ముహం వాడికేమి తెల్సు. వాడి మంచి చెడులు చూడవలసిన దాన్ని నేను. వాడి పెళ్ళి విషయంలో రెండు షరతులు వున్నయి. మొదటిది అమ్మాయి మా కులానికి చెందినది అయి వుండాలి. రెండోది కనీసం రెండు లక్షలు కట్నం తేవాలి. ఈ షరతుల్లో రాజీ పడే ప్రసక్తే లేదు." అన్నది సులోచనా దేవి.

రెండవ షరతు విషయంలో ఇబ్బంది లేదు గానీ, మొదటి షరతు విషయంలోనే అసలు అభ్యంతరం.

కరుణ మీద ఎంత ప్రేమ, వ్యామోహం వున్నా, తల్లి మాట కాదన లేక పోయాడు. "ఆమె మాట కాదంటే ఎంతటి అఘాయిత్యం అయినా చేస్తుంది. ఆమె సంగతి నీకు తెలియదు " అన్నాడు ఆనంద్.

కరుణ కన్నీరు నింపు కోవటం మినహా మరేమీ చేయ లేక పోయింది. తరువాత చాలా కాలం గడిచింది.

చూస్తుండగానే అనంద్ జీవితం లో చాలా దశలు జరిగి పోయాయి. పెళ్ళి జరిగింది. తండ్రి అయ్యాడు. భార్య ఉండీ లేనిదే అయింది.

ఇన్నేళ్ళ తరువాత ఇప్పుడు కరుణ కు అనంద్ విషయాలు అన్నీ తెలిసాయి. తొలి ప్రేమ ఇంకా ఆమెలో మిగిలే ఉంది.

కరుణ తరచూ అనంద్ ఇంటికి వస్తూనే వుంది. వెళ్ళి నప్పుడల్లా బహుమతులు తీసుకు వెడుతూనే వుంది.

"ఎందుకమ్మా వీడి మీద నీకు ఇంత కరుణ ?" అని అడిగింది సులోచనా దేవి.

"ఏమో, నాకు తెలిస్తే కదా మీకు చెప్పటానికి.. వీడిని పెంచుకుంటాను మీకు అభ్యంతరం లేక పోతే..." అని అడిగింది కరుణ.

"వాడికి తల్లీ దండ్రీ వున్నా లేని వాళ్ళు అయ్యారు. నువ్వు కరుణించిన దేవత లా వచ్చి ఆదుకుంటానంటే, అంత కన్నా కావలిసింది ఏముంటుంది ? " అన్నది సులోచనా దేవి.

కరుణ బాబును ఎత్తుకొని వెళ్ళి కారులో కూర్చుంది. పసివాడిని గుండెలకు హత్తు కుంటే, అనంద్ ను హత్తు కున్నట్లే వుంది.

"ఎప్పుడో ఒక రోజు అనంద్ తనను వెతుక్కుంటూ వస్తాడు వీడి కోసం అయినా ..." అనుకున్నది కరుణ నిట్టూరుస్తూ. .

★★★★★★★★★★★★

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.